నిధులు లేక సర్పంచులు విలవిల

- వేతనాలు అందక ఇబ్బందుల్లో మల్టీపర్పస్ వర్కర్లు
- మంజూరుకాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు



షాబాద్ మండలం నాగర్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కొన్ని నెలలుగా నిధులు రాకపోవడంతో జిల్లాలోని సర్పంచులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామాలుగా నిలుస్తున్నా.. జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి లేదని పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 11 నెలలుగా ప్రభుత్వాల నుంచి నిధులు రాక అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పంచాయతీల నిర్వహణ తలకుమించిన భారంగా మారుతుందని సతమతమవుతున్నారు. అలాగే సంవత్సర కాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నామని పేర్కొంటున్నారు.

అప్పులు చేసి అభివృద్ధి పనులు..

జిల్లాలోని 558 మంది సర్పంచ్‌లు గత సంవత్సరం మార్చి నెలలో ఖాతాలు తీశారు. ఒక నెల నేరుగా వారి ఖాతాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం జమ చేసింది. తర్వాత నిధులను నిలిపివేసింది. దీనికి తోడు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు కూడా నిలిచిపోయాయి. దీంతో అప్పులు చేసి అభివృద్ధి చేయాల్సి వస్తుందన్నారు. కేంద్రం నిధుల విడుదల నిలిపివేయగా, ఖాతాల్లో ఉన్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజ్ చేయడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు.

సిబిల్ స్కోర్‌పై ప్రభావం..

అభివృద్ధి కోసం అప్పు చేసేందుకు సర్పంచ్‌లు వ్యక్తిగత పాన్, ఆధార్‌కార్డులను బ్యాంకులకు సమర్పించారు. నిధులు నిలిచిపోవడంతో బ్యాంకుల్లో కిస్తులు చెల్లించడం లేదు. దీంతో బ్యాంకుల్లో వ్యక్తిగతంగా డిఫాల్టర్ మారి సిబిల్ రిపోర్టుపై ప్రభావం పడడంతో వ్యక్తిగత రుణాలకు దూరమవుతున్నట్లు సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. ఒక్కో సర్పంచ్‌కు సుమారు రూ.లక్షల్లో బిల్లులు రావాల్సి ఉండగా అప్పులు చేసిన పలువురు సర్పంచ్‌లు వాటిని చెల్లించేందుకు ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇటీవల కలెక్టర్‌కు కలిసి సమస్యలను విన్నవించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జీపీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

రుణాలకు దూరమవుతున్నాం



ట్రాక్టర్, ట్యాంకర్లు కొనుగోలుకు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. పంచాయతీలకు ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు చెల్లించడం లేదు. ఫలితంగా మా ఖాతాలు డిఫాల్టర్‌గా మారాల్సి వస్తుందని. సిబిల్ తగ్గడంతో వ్యక్తిగతంగా భవిష్యత్తులో నష్టం కలుగుతుంది.

– శ్రీనివాస్‌గౌడ్ సర్పంచ్, మక్తగూడ

జీతాలు ఇవ్వలేకపోతున్నాం..



జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెలా జీతాలు చెల్లించలేకపోతున్నాం. ట్రాక్టర్ ఈఎంఐలు, కరెంట్ బిల్లులు చెల్లించేందుకు ఇబ్బందిగా మారింది. ఈ నెలాఖరి వరకు ప్రభుత్వాలు నిధులను విడుదల చేయాలి. 3 నెలలుగా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు.

– సుబ్రమణ్యేశ్వరీ సర్పంచ్, షాబాద్

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

కొందుర్గు: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పర్యటించి పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహదేవ్‌పూర్‌లో సీడీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రేగడిచిల్కమర్రిలో నూతనంగా నిర్మించిన మైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గ్రామంలో ఏర్పాటు చేసిన బండ లాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు సర్పంచ్‌లు బుచ్చమ్మ, రామ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, రామకృష్ణ, గోపాల్, బందులాల్, నరేందర్, శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం

నందిగామ: మండలంలోని అప్పారెడ్డిగూడలో నిర్మించిన 33/11 కెవి సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి మంత్రి సబితారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోని ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు లత, సర్పంచులు నర్సింహా, అశోక్, రమేశ్‌గౌడ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


నందిగామ: సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి

క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అధ్యక్షతన సోమవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

విద్యార్థినికి సన్మానం


నవ్యశ్రీని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు ఎంపికైన విద్యార్థి నవ్యశ్రీని శనివారం బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు నవ్యశ్రీ ఎంపిక కావడం షాద్‌నగర్‌కు ఎంతో గర్వకారణమని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, మురళీ, రుషికేష్, మేఘన, శేఖర్, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మోకిల సీఐగా నరేష్



శంకర్‌పల్లి: మండలంలోని మోకిలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలీస్‌స్టేషన్‌కు పి.నరేష్‌ని సీఐగా నియమిస్తూ సైదాబాద్ సీఐ స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరేష్ ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైం విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. మోకిల రైతు వేదిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో నూతన పోలీస్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా మోకిలలోని ఓ ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి బాధ్యతలు స్వీకరించడం జరుగుతుంది.

చీఫ్ మినిస్టర్ కప్‌కు దరఖాస్తులు

కేశంపేట: చీఫ్ మినిస్టర్ కప్ క్రీడాల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని సీఎం కప్ మండలస్థాయి కమిటీ చైర్మన్, ఎంపీపీ రవీందర్ యాదవ్ అన్నారు. ఈ నెల 15 నుంచి17 వరకు పురుషులకు ఫుట్‌బాల్, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా రన్నింగ్(100 నుంచి 400ల మీటర్లు), కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

కేశంపేట: గ్రామానికి చెందిన మంగళిగిరి ఇటీవల మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో తోటి మిత్రులు, రాజకీయ నాయకులు లక్ష ఐదువేల ఆర్థిక సహాయం శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ రవీందర్ యాదవ్, స్త్రీశిశుసంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల, సర్పంచ్ వెంకట్‌రెడ్డిలు ఐదువేల చొప్పున సాయం చేశారు. శంకర్, అంజయ్య, నర్సింహ, లింగం, యాదగిరి, శరత్, వెంకటేశ్, రాజేష్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించండి


మే డే ఉత్సవాల్లో నాయకులు, కూలీలు

కందుకూరు: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అంకగళ్ల కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కందుకూరులో కొనసాగుతున్న ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో మేడే వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్ర జెండా ఎగురవేసి సంబురాలు జరుపుకొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగు నీరు అందుబాటులో ఉంచకపోవడం బాధాకరమని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఉపాధిహామీ పథకానికి బడ్జెట్ తగ్గించడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, శేఖర్, కుమార్, సత్తయ్య, కె.రాములు పాల్గొన్నారు.

జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయండి


కార్యదర్శులతో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలని కార్యదర్శులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ..నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్ పూర్తయిన తరువాత రెగ్యులరైజేషన్ చేయడంతో పాటుగా పే స్కేలు అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. గడువు ముగిసినా తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించక పోవడంతోనే నిరవధిక సమ్మె చేపట్టినట్లు తెలిపారు. మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. రెగ్యులరైజేషన్ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, మీ డిమాండ్లపై సీఎం కేసీఆర్ సానుకూలంగానే ఉన్నారని చెప్పారు. సమ్మెను విరమించుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని మరోసారి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్, ధీరజ్, జగదీశ్, ప్రమోద్, శ్రీనివాస్, చెన్నయ్య, ప్రదీప్, వరలక్ష్మి, సౌమ్య, అరుణ, నందిని తదితరులు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

మొయినాబాద్: కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చిలుకూరు గ్రామానికి చెందిన జీ రాణి(42) స్థానిక బాలాజీ ఆలయం వద్ద కొబ్బరి కాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. శనివారం ఉదయం బాధ భరించలేక ఇంట్లో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హిందూధర్మంపై అనైతిక వ్యాఖ్యలు సరికాదు


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీవర్ధన్ రెడ్డి

కొందుర్గు: కర్ణాటకలో మైనార్టీల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ హిందూ ధర్మంపై అనైతిక వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ అనే ధార్మిక సంస్థలు రామ మందిర నిర్మాణం కోసం ఉద్యమం చేసి హిందూ ధర్మాన్ని కాపాడాయని తెలిపారు. అలాంటి సంస్థలనే నిషేధిస్తామని అనడం హేయమైన చర్య అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, భూపతి రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వీరేశం, యాదయ్య, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో రైతులకు కష్టాలు

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌ను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి, మార్కెట్‌లో ధాన్యం ఆరబోసిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి పాటుపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో రైతులు కష్టాలపాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభించక ఇలా జరుగుతుందన్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులు ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువస్తే కనీస సౌకర్యాలు లేక ధాన్యం తడిసి రైతుల విలవిలలాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మార్కెట్‌లో అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని యెడల రైతులకు కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, రమేశ్‌యాదవ్, వెంకటేశ్‌గౌడ్, మల్లేశ్ రైతులు పాల్గొన్నారు.

పానాది బాటను రక్షించాలని వినతి


తహసీల్దార్ నయిముద్దీన్‌కు వినతి పత్రం గ్రామస్తులు

శంకర్‌పల్లి: రైతులు పొలాలకు వెళ్లే పానాది బాటను రక్షించాలని శేరిగూడ గ్రామస్తులు శనివారం తహసీల్దార్ నయిముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శేరిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 167,168లో రైతులు పొలాలకు వెళ్లే పానాది బాట గత 50సంవత్సరాలుగా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆ బాటలో నడుచుకుంటూ, ఎండ్ల బండ్లపై పొలాలకు వెళ్లే వారమని తెలిపారు. కాగా, సంగారెడ్డి జిల్లా, పటాన్‌చెరువు మండలం, వెలిమల గ్రామానికి చెందిన రియల్ వ్యాపారి చంద్రశేఖర్‌రెడ్డి పొలాలను కొనుగోలు చేసి బాటను కబ్జా చేశాడని ఆరోపించారు. కబ్జా గురించి అడిగితే నా సొంత పొలంలో ఉందని దౌర్జన్యానికి దిగుతున్నాడని వాపోయారు. రెవెన్యూ అధికారులు అతనిపై చర్యలు తీసుకొని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, గ్రామ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్‌గౌడ్, చంద్రశేఖర్, వెంకట్, విఠలయ్య, నర్సింలు, సాయేందర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ కేంద్రం ప్రారంభం


మజ్జిక కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

చేవెళ్ల: మండలంలోని ఈర్లపల్లి బస్టాప్ వద్ద శనివారం సర్పంచ్ రాజశేఖర్ గురుస్వామి, ఎం.శ్రీనివాస్ గురుస్వామి సహకారంతో బాటసారులకు, వాహనదారులకు ఉచితంగా మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు కేంద్రాన్ని ప్రారంభించి బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తోచిన విధంగా తోటి వారికి సహాయం చేయాలని చెప్పారు. ఎండలో దూర ప్రయాణం చేసే వారు కాసేపు ఆగి చల్లని మజ్జిగ తాగే విధంగా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అయ్యప్ప స్వామి భక్తులు ఎం.శివకుమార్, ప్రవీణ్, సుధాకర్, రాఘవేందర్, మణికుంత, మహేందర్, అంజయ్యగౌడ్, రాజేశ్, సిహెచ్ రమేశ్, శివ, శ్రీనివాస్, రమేశ్, సురేందర్, విగ్నేష్, వినోద్ కుమార్, శ్రీశైలం, మాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండలంలోని మధురాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలో బొడ్రాయికి హోమం, ధాన్యాభిషేకం, పుష్పాభిషేకం, పాలాభిషేకం, ధనాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు కలశాల్లో తీసుకొచ్చిన నీటితో అభిషేకాలు నిర్వహించారు. బాజాభజంత్రీలు, కోలాటాలు, బతుకమ్మ ఆటలు ఆడారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, ఎల్.మోహన్‌రెడ్డి, రంగయ్యగౌడ్, బాల్‌రాజ్, దామోదర్‌రెడ్డి, నర్సింలు, డాక్టర్ విజయ్‌కుమార్, వెంకటేష్‌గుప్త, రాజేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పుల్లారెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజుగౌడ్, వీరేందర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే గ్రామాల అభివృద్ధి

మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్యామ్‌రావు

మొయినాబాద్‌రూరల్: యువతతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు షాబాద్ శ్యామ్‌రావు, బీఆర్‌ఎస్ మండల నాయకులు రాఘవేందర్‌యాదవ్‌లు అన్నారు. శనివారం మండలంలోని హిమాయత్‌నగర్‌లో శాంతి యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా బ్యాలెట్ ఓటు పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలు సీఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా శాంతి యువజన సంఘం సభ్యులుగా 560 మంది ఉండగా అందులో 467 ఓటు పోలైయ్యాయి. ఈ ఎన్నికల్లో నరేష్ ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, కుమ్మరి వినయ్‌లు పోటీలో నిలువగా బుర్రకాయల నరేష్‌ముదిరాజ్‌కు 212 ఓట్లు రాగా, సమీప అభ్యర్థి వెంకటేష్‌ముదిరాజ్‌కు 165 ఓట్లు వచ్చాయి. దీంతో నరేష్‌ముదిరాజ్ 47 మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన నరేష్, రొనాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణుగౌడ్‌లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓడిన, గెలిచిన సమానంగా తీసుకొని యువత గ్రామ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శాంతియువజన సంఘం ఈసీ సభ్యులు ముదిగొండ రవియాదవ్, ప్రకాష్‌ముదిరాజ్, శ్రీనివాస్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు సహించం

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ హెచ్చరించారు. శనివారం మండలంలోని మహాలింగపురంలో ఉపాధి హామీ పనులు, నర్సరీలను ఆయన పరిశీలించారు. వెంకయ్యగౌడ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలు ప్రతీ రోజు సమయపాలన పాటించి పనుల్లోకి రావాలని సూచించారు. పనులకు రాకుండా కూలీ డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని తెలిపారు.

శంకర్‌పై దుషణలు మానుకోవాలి


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి వీర్లపల్లి శంకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు నరేందర్, వజ్రమ్మ డిమాండ్ చేశారు. శనివారం కొందుర్గులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శంకర్‌పై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా కొందుర్గు ఎస్సై వెంకటేశ్వర్లుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ వైఖరి తెలపాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా జిల్లా కోకన్వీనర్ సురేష్



కేశంపేట: ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ స్పష్టమైన వైఖరిని తెలపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గ్యార సురేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న తెలంగాణ భరోసా సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభలో ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ ఉద్దేశం తెలియజేయాలని కోరారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతున్న బీఎస్పీ మాట్లాడాక పోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు నర్సింహా

షాద్‌నగర్‌రూరల్: బీఎస్పీ అధినేత్రి మాయావతి 'తెలంగాణ భరోసా సభ'కు హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ ప్రకటన చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పెంటనోళ్ల నర్సింహ్మా డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. కాన్షీరాం సిద్ధాంతానికి బీఎస్పీ కట్టుబడి ఉంటే మాయావతి తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతు ప్రకటించాలని కోరారు. పస్తుత రిజర్వేషన్లతో ఎస్సీల్లో తక్కువ జనాభా కలిగిన ఒక్క కులానికే అత్యధిక రిజర్వేషన్లు దక్కుతున్నాయన్నారు. అత్యధిక జనాభా కలిగిన మాదిగలు, ఉపకులాలకు రావాల్సిన రిజర్వేషన్లు రాకపోవడంతో నష్టపోతున్నారని వాపోయారు. జనాభా ప్రాతి పదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఉద్యమం జరుగుతుందని అన్నారు. గతంలో హైదరాబాద్‌కు వచ్చిన మాయావతి వర్గీకరణను వ్యతిరేకిస్తూ ప్రకటన చేయడంతో లక్షలాది మంది మాదిగ బిడ్డలు నిరాశకు గురయ్యారని అన్నారు. వర్గీకరణకు సానుకూల ప్రకటన చేసి సామాజిక న్యాయం పట్ల నిబద్ధతను చాటుకోవాలని సూచించారు. లేని యెడల బీఎస్పీని మాదిగ, ఉపకులాల ప్రజలు వ్యతిరేకిస్తారని చెప్పారు.